# ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- రేపటితో ముగియనున్న ప్రచారం
- జిల్లా ఎన్నికల అధికారి వల్లూరు క్రాంతి



సంగారెడ్డి కలెక్టరేట్, మే 9: జిల్లాలో ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వల్లూరు క్రాంతి తెలిపారు. ఎస్పీ చెన్నూరి రూపేశ్‌తో కలిసి గురువారం కలెక్టరేట్‌లో విలేకరులతో మాట్లాడారు. శనివారం సాయంత్రం 6 గంటలతో ప్రచార గడువు ముగుస్తుందని పేర్కొన్నారు. ఆయా రాజకీయ పార్టీల కోసం వచ్చిన ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వారు వారి స్థానాలకు వెళ్లిపోవాలని సూచించారు. 72 గంటలపాటు ఎలాంటి సభలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఐదుగురికంటే కంటే ఎక్కువ మంది గుమికూడరాదని సూచించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్ల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలన్నారు. మద్యం, డబ్బు, వస్తువులు పంపిణీ చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అభ్యర్థుల ప్రతి రూపాయి ఖర్చుపై నిఘా ఉంటుందని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీ విజిల్ యాప్ ద్వారా సమాచారం అందించాలన్నారు. జిల్లాలోని అన్ని పోలింగ్ స్టేషన్లలో పోలింగ్ ప్రశాంతంగా, సజావుగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. అనంతరం ఎస్పీ రూపేశ్ మాట్లాడుతూ పోలింగ్ నుంచి స్ట్రాంగ్ రూమ్‌ల వరకు బందోబస్తు చేపట్టనున్నట్టు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ప్రత్యేక బలగాలు కూడా పాల్గొంటాయని తెలిపారు. ఎలాంటి చిన్నపాటి ఘర్షణ తలెత్తినా పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. 72 గంటలపాటు అన్ని ఫంక్షన్ హాల్స్, ఫాంహౌస్‌లను తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కేసులు పెట్టేందుకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు.

# ఎన్నికల విధుల్లో అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఎస్పీ చెన్నూరి రూపేశ్

- సిబ్బంది ఈవీఎంలను వదిలి వెళ్లొద్దు
- అధికారులకు సూచించిన ఎస్పీ చెన్నూరి రూపేశ్

సంగారెడ్డి, మే 9: పోలీసు అధికారులు, సిబ్బంది ఎవరు కూడా విధుల్లో అలసత్వం వహించొద్దని, ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు పరస్పర సహకారం తీసుకోవాలని ఎస్పీ చెన్నూరి రూపేశ్ సూచించారు. గురువారం పట్టణంలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేసి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల ప్రవర్తనా నియమావళికి లోబడి పని చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో సిబ్బంది అలసత్వం వహించొద్దన్నారు. ఏ చిన్న ఘటన జరగడానికి ఆస్కారం ఉన్నా వెంటనే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. రూట్ మొబైల్ అధికారులు డీఆర్‌సీ సెంటర్ నుంచి ఈవీఎంలు వెళ్లే వరకు నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ అనంతరం డీఆర్సీ సెంటర్లకు చేరే వరకు ఈవీఎంలను వదిలి సిబ్బంది వెళ్లొద్దన్నారు. గత ఎన్నికల్లో అల్లర్లు సృష్టించిన వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. పోలింగ్ ముగియడానికి ముందు 48 గంటల పాటు వైన్ షాపులు, లేట్ నైట్ దాబాలు క్లోజ్ చేయించాలని, రాజకీయ నాయకుల ప్రచార వాహనాలు తిరగకుండా చూడాలన్నారు. పోలింగ్ స్టేషన్‌కు వందమీటర్ల దూరం వరకు రాజకీయ నాయకులకు సంబంధించిన హోర్డింగ్, ఫ్లెక్సీలు, బ్యానర్లు లేకుండా చూసుకోవాలన్నారు. రెస్టారెంట్లు, లాడ్జీలను చెక్ చేసి ఇతర ప్రాంతాలకు చెందిన వ్యక్తులు రాకుండా ఎన్నికల సిబ్బంది చర్యలు చేపట్టాలన్నారు. ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలని, చెక్ పోస్టుల వద పటిష్టమైన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు.


# అంకితభావంతో విధులు నిర్వర్తించాలి



గీతంలో జ్యోతి ప్రజ్వలన చేస్తున్న స్వామి రాఘవేంద్ర ప్రభు

పటాన్‌చెరు, మే 9: అంకితభావంతో విధులు నిర్వర్తించాలని గీతంలో నిర్వహించిన ముదిత కార్యక్రమంలో హరే కృష్ణకు చెందిన స్వామి రాఘవేంద్ర ప్రభు అన్నారు. గురువారం రుద్రారంలోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్‌లో పనిచేస్తున్న ఉత్తమ సహాయక, అనుబంధ ఉద్యోగుల సేవలను ప్రశంసించడంతోపాటు వారికి అవార్డులిచ్చి ప్రోత్సహించేందుకు డైరెక్టరేట్ ఆఫ్ హాస్పిటాలిటీ వారు ముదిత పేరిట కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన స్వామి రాఘవేంద్ర మాట్లాడుతూ శ్రమించేవారికి ఏ యాజమాన్యం అయినా విలువ ఇస్తుందన్నారు. గీతంలో విధులు నిర్వర్తించే సాధారణ ఉద్యోగులను గుర్తించి అవార్డులు, ప్రశంసలు ఇవ్వడం మంచి సంప్రదాయం అన్నారు. కార్యక్రమంలో ఉద్యోగులు, సిబ్బంది పాటలు పాడి, నృత్యాలు చేసి ప్రతిభ చాటారు. నాటకాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో గీతం హైదరాబాద్ అదనపు ఉపకులపతి డీఎస్ రావు, క్యాంపస్ లెఫ్ట్ డీన్ డాక్టర్ బాలకుమార్ గురునాథ్ మూర్తి, హాస్పిటాలిటీ డైరెక్టర్ హేమంత్ బగ్గా, హాస్పిటాలిటీ డిప్యూటీ డైరెక్టర్ అంబికా ఫిలిస్ తదితరులు పాల్గొన్నారు.

# తండ్రిని హతమార్చిన కొడుకు




అహ్మద్‌నగర్‌లో వివరాలు సేకరిస్తున్న పోలీసులు

రాయపోల్, మే 9: తాగుడుకు బానిసైన కొడుకు తండ్రిని కడతేర్చిన ఘటన దౌల్తాబాద్ మండలంలోని అహ్మద్‌నగర్ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పఠాన్ ఫరూఖ్ తాగుడుకు బానిసయ్యాడు. తల్లిదండ్రులను తాగేందుకు డబ్బు ఇవ్వాలని నిత్యం వేధించేవాడు. ఈ క్రమంలోనే గురువారం అర్ధరాత్రి ఫరూఖ్ మద్యం తాగేందుకు డబ్బులు ఇవ్వమని గొడవ చేశాడు. అందుకు తండ్రి కోపంతో నిరాకరించగా తీవ్ర వాగ్వాదానికి దిగాడు. దీంతో ఆగ్రహానికి లోనైన ఫరూఖ్ కత్తితో పొడిచాడు. ఆయనకు తీవ్ర గాయం కావడంతో తండ్రి వలీఖాన్(60) అక్కడికక్కడే మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దౌల్తాబాద్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వలీఖాన్ మృతదేహాన్ని పోస్ట్‌మార్టం నిమిత్తం గజ్వేల్ ప్రభుత్వ దవాఖానకు తరలించినట్లు దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ చెప్పారు. గజ్వేల్ ఏసీపీ పురుషోత్తంరెడ్డి, తొగుట సీఐ లతీఫ్, దౌల్తాబాద్ ఎస్ఐ శ్రీరాం ప్రేమ్‌దీప్ అహ్మద్‌నగర్ హత్య వివరాలు సేకరించారు.

# పోలింగ్ కేంద్రాల్లో వసతులు కల్పించాలి

అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్



అందోల్‌లో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

అందోల్, మే 9: ఎంపీ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేయాలని అసిస్టెంట్ కలెక్టర్ మనోజ్ అధికారులకు సూచించారు. గురువారం అందోల్, జోగిపేట మున్సిపాలిటీలోని పలు పోలింగ్ కేంద్రాలతోపాటు సంగుపేట, పోతిరెడ్డిపల్లి, కొండారెడ్డిపల్లి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న జరిగే పోలింగ్‌లో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. సిబ్బంది అన్ని కేంద్రాలను సందర్శించి ఏమైనా లోటుపాట్లు ఉంటే తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో పాండు, ఎంపీడీవో, సిబ్బంది ఉన్నారు.

# మోసపోయి గోసపడుతున్నాం

- కాంగ్రెస్‌కు ఓటుతో బుద్ధి చెప్పాలి
- గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి
- సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు

న్యాల్‌కల్, మే 9: కాంగ్రెస్ హామీలతో మోసపోయి గోసపడుతున్నామని, ఎంపీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. గురువారం సాయంత్రం జహీరాబాద్ పట్టణంలో బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు మద్దతుగా భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఐదు నెలలైనా హామీలు అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు కింద రూ.15 వేలు ఇస్తామన్నరు.. గతంలో కేసీఆర్ ఇచ్చిన రూ.10 వేలు కూడా ఇవ్వడం లేదన్నారు. ఇక రైతు బీమా ఊసేలేదని, రైతలకు ఎలాంటి భరోసా లేదని, మహిళలకు ఇస్తామన్న రూ.2,500, కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం పత్తాలేకుండా పోయాయని ఎద్దేవా చేశారు. ఇందులో ఏ ఒక్క హామీ నెరవేరినా కాంగ్రెస్‌కు ఓటు వేయాలని, లేకపోతే బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. కాంగ్రెస్ వచ్చిన నాటి నుంచి తెలంగాణలో కరువుఛాయలు అలుముకొన్నాయని, తాగు, సాగు నీరు, విద్యుత్ తదితర సమస్యలతో ప్రజలు, రైతులు ఇబ్బందులు పాడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాలుగైదు నెలల్లోనే ఇలాంటి దుర్భర పరిస్థితి నెలకొంటే వచ్చే ఐదేండ్లల్లో ఎలాంటి కష్టాలు అనుభవించాల్సి వస్తుందోనని ప్రజలు ఆందోళన చెందుతున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యే మాణిక్‌రావును భారీ మెజార్టీతో గెలిపించిన మాదిరిగానే ఎంపీ ఎన్నికల్లోనూ గాలి అనిల్ కుమార్‌ను కూడా భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరాబాద్ ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ శివకుమార్, పార్లమెంట్ ఎన్నికల సమన్వయ కర్త దేవీప్రసాద్, ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ నరోత్తం, తదితరులు పాల్గొన్నారు.



జహీరాబాద్ రోడ్‌షోలో మాట్లాడుతున్న సిద్దిపేట ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు



జహీరాబాద్‌లో హరీశ్‌రావు రోడ్‌షోకు భారీగా తరలివచ్చిన ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు

## దూరప్రాంతాలకు ఆర్టీసీ సేవలు

సంగారెడ్డి, మే 9: ఎంపీ ఎన్నికల నేపథ్యంలో దూరప్రాంతాలకు వెళ్లే ప్రయాణికుల కోసం ఆర్టీసీ బస్సులు నడుపుతున్నట్లు రీజినల్ మేనేజర్ ప్రభులత గురువారం ప్రకటనలో తెలిపారు. కందుకూరు, పొదిలి, కనిగిరి, ఒంగోలు, కడపలకు 17 బస్సులు నడుపుతున్నామని, ఈ ప్రాంతాలకు వెళ్లే వారి కోసం రిజర్వేషన్ సౌకర్యం కల్పించామని పేర్కొన్నారు. 13న ఎన్నికల సందర్భంగా శుక్రవారం 70 బస్సులు, శనివారం 11వ తేదీన 65 బస్సులు, ఆదివారం 12న 50 బస్సులు, అదనంగా నడిపేందుకు ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం నడుస్తున్న 545 బస్సులతో పాటు అదనంగా బస్సులు నడుపుతున్నట్లు తెలిపారు. ముఖ్యమైన ట్రాఫిక్ ప్రాంతాలైన జేబీఎస్, ఎంజీబీఎస్, లింగంపల్లి, సంగారెడ్డి వంటి పాయింట్లలో అధికారులు, సూపర్‌వైజర్లను పర్యవేక్షణకు నియమించామని, ప్రయాణికులకు తాగునీటి సదుపాయం కల్పించామని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# అభివృద్ధిని చూసి ఓటేయండి

నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి



బోర్గిలో కార్యకర్తలతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

కంగ్టి, మే 9: బీఆర్ఎస్ హయాంలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధిని చూసి కారు గుర్తుకు ఓటేసి గాలి అనిల్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని నారాయణఖేడ్ మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి కోరారు. గురువారం కంగ్టి మండలంలోని ఎన్కెమూరి, సిద్దంగిర్గ, బోర్గి, చౌకన్‌పల్లి తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ , కాంగ్రెస్, బీజేపీలు రెండు దొందూ దొందేనని, పదేండ్ల కాలంలో బీఆర్ఎస్ అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 60 ఏండ్లు పాలించిన కాంగ్రెస్ రాష్ట్రాభివృద్ధిని గాలికి వదిలేసిందని ఆరోపించారు. బీబీ పాటిల్ రెండుసార్లు ఎంపీగా ప్రాతినిధ్యం వహించినప్పటికీ గ్రామాలకు అందుబాటులో ఉన్నాడా? అని ప్రశ్నించారు. ప్రజల సమస్యలను పట్టించుకోని బీబీ పాటిల్ ఇప్పుడు బీజేపీలో కల్లబొల్లి మాటలు చెబుతున్నాడన్నారు. 13న జరిగే ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీ అందించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు గంగారం, జిల్లా నాయకుడు వెంకట్‌రెడ్డి, రైతుబంధు మండలాధ్యక్షుడు ఆంజనేయులు ఆయాగ్రామాలకు చెందిన ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లోకి..**

నిజాంపేట్, మే 9: మండల పరిధిలోని దామరచెరువు గ్రామానికి చెందిన పదిహేను కుటుంబాలు గురువారం మాజీ ఎమ్మెల్యే భుపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. అదే గ్రామానికి చెందిన పలువురు బీఆర్ఎస్ నేతలతకు ఆశచూపి కాంగ్రెస్‌లో చేర్చుకున్నా వారు తిరిగి సొంతపార్టీలోకి వచ్చారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్‌కు భారీ మెజార్టీ వచ్చేలా కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నారాయణఖేడ్ మండల ఉపాధ్యక్షుడు సాయిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు, నవాబ్ పాటిల్, జగదీశ్వరచారి, తదితరులు ఉన్నారు.

## చెత్తకుప్పలో శిశువు మృతదేహం

గుమ్మడిదల, మే 9: అప్పుడే పుట్టిన మగ శిశువు చెత్తకుప్పల్లో మృతదేహంగా కనిపించింది. కండ్లుకూడా తెరవని ఆ పసి గుడ్డును చెత్తకుప్పలో పడవేసిన హృదయ విధారక ఘటన దోమడగు కాలనీలోని పోచమ్మతల్లి ఆలయ సమీపంలో గురువారం చోటుచేసుకుంది. ఈ విషయాన్ని స్థానికులు పోలీసులకు తెలియజేయడంతో ఘటనా స్థలానికి ఎస్సై మహేశ్వర్‌రెడ్డి, ఐసీడీఎస్ సూపర్‌వేజర్ కవిత, మాజీ సర్పంచ్ రాజశేఖర్, స్థానికులు పరిశీలించారు. శిశువు మృతదేహాన్ని పటాన్‌చెరు ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## బస్సుల్లో జేబు దొంగలు



ప్రయాణిలను తనిఖీ చేస్తున్న పోలీసులు

అందోల్, మే 9: జోగిపేట బస్టాప్, బస్సుల్లో జేబుదొంగలు చేతివాటం ప్రదర్శిస్తున్నారు. జనం రద్దీగా ఉన్న బస్సులనే లక్ష్యంగా చేసుకుంటున్న దొంగలు బంగారు నగలు, నగదు, మొబైల్ ఫోన్లు చోరీ చేస్తున్నారు. గురువారం జోగిపేట నుంచి వట్‌పల్లి వెళ్తున్న ఆర్టీసీ బస్సు బస్టాప్‌లోకి వచ్చి రాగానే పెద్ద సంఖ్యలో ప్రయాణికులు బస్సు ఎక్కేందుకు ఎగబడ్డారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని వ్యక్తులు ఇద్దరు మహిళల దగ్గర ఫోన్లు చోరీ చేశారు. గుర్తించిన బాధితులు వెంటనే జోగిపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకున్నారు. బస్సుల్లో అందరి వద్ద తనిఖీలు చేశారు. అయినా ఎవరి వద్ద ఫోన్లు లభించలేదు. ఆర్టీసీలో ఉచిత ప్రయాణం ప్రారంభమైన్ననుంచి తమకు రక్షణ లేకుండా పోయిందని పలువురు మహిళలు ఆరోపించారు. కిక్కిరిసిన బస్సుల్లో తరుచూ దొంగతనాలు జరుగుతూ విలువైన వస్తువులు పోగొట్టుకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు.


## పేదల సంక్షేమానికి కృషి

నాగల్‌గిద్ద, మే 9: కాంగ్రెస్‌తో పేదలకు సంక్షేమ పథకాలు అందుతాయని ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవ్‌రెడ్డి అన్నారు. మండలంలో కరస్‌గుత్తి, నాగల్‌గిద్ద గ్రామాల్లో గురువారం కాంగ్రెస్ అభ్యర్థి సురేశ్‌కుమార్ శెట్కార్‌కు మద్దతుగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమానికి పాటుపడే కాంగ్రెస్‌కు భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో అసెంబ్లీ ఇన్‌చార్జి శశికళాయాదవరెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాకేశ్‌శెట్కార్, సోపాన్ పాటిల్ తదితరులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలి



ఆర్సీపురం: శ్రీసాయినగర్‌లో మహిళను ఓట్లు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ పుష్పానగేశ్



నిజాంపేట్: ఉపాధి పనుల వద్ద మట్టి తట్ట ఎత్తుకొని ఓట్లు అభ్యర్థిస్తున్న నాయకులు

గులాబీ పార్టీ జోరుమీదున్నది. ఊరూవాడా.. గడపగడపకూ తిరుగుతూ కారు గుర్తుకు ఓటేయమంటున్నది. మరొక్క రోజే ప్రచారానికి సమయం ఉండడంతో బీఆర్ఎస్ శ్రేణులు కరపత్రాలు పంచుతూ బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమం గురించి ప్రతి ఒక్కరికి వివరిస్తూ కారుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్నారు. జహీరాబాద్ ఎంపీ అభ్యర్థి గాలి అనిల్‌కుమార్, మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా గురువారం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహించారు. గులాబీ నేతలకు గ్రామాలు, పట్టణాల్లో విశేష స్వాగతం లభించింది. బీఆర్ఎస్ అభ్యర్థులకు భారీ మెజార్టీ అందిచాలని కోరారు.


- నమస్తే తెలంగాణ నెట్‌వర్క్, మే 9



జిన్నారం: ఇంటింటి ప్రచారంలో గూడెం యాదమ్మ, జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్



బొల్లారం: బీరప్ప బస్తీలో మహిళను ఓటు అడుగుతున్న మాజీ జడ్పీటీసీ బాల్‌రెడ్డి



అందోల్: నేరడిగుంటలో ప్రచారం చేస్తున్న నాయకులు



నిజాంపేట్: మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరికలు



రాయికోడ్: ధర్మాపూర్ ప్రచారం నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు



హత్నూర: సిరిపురలో బీఆర్ఎస్ నేతల ఎన్నికల ప్రచారం



న్యాల్‌కల్: మల్గిలో ప్రచారం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



గుమ్మడిదల: బొంతపల్లిలో ఇంటింటి ప్రచారం